ప్రజాశక్తి
శనివారం 30 ఆగస్టు 2025
శ్రీ సత్యసాయి

ఎంజిఎం పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. శుక్రవారం పుట్టపర్తి లో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నుండి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగ నాయకులు, ఫిజికల్ డైరెక్టర్ లోక్‌నాథ్ అవార్డు అందుకున్నారు. 2023- 24 విద్యా సంవత్సరంలో క్రీడల్లో మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల కనబరిచిన ప్రతిభను ఆధారంగా చేసుకుని అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ ఉదయ్ భాస్కర్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి మురార్జీ యాదవ్, సుదర్శన్ రెడ్డి, పీడీలు విలియమ్స్, రాణి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఐదు పాఠశాలలను ఎంపిక చేసి వాటికి అవార్డులు అందజేశారు. అందులో ఎంజిఎం హై స్కూల్ ఐదవ స్థానంలో అవార్డు అందుకుంది.

'ప్రయివేటు'కు ఆటస్థలం కరువు..

- ఇరుకు గదుల్లో చదువులు
- ఆటలకు స్వస్తి చెబుతున్న విద్యాసంస్థలు
- క్రీడా మైదానాలు లేకపోయినా అనుమతులిస్తున్న అధికారులు
- వ్యాపార సంస్థలుగా మారిన కళాశాలలు

ప్రజాశక్తి - పరిగి

ప్రస్తుత ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. ముఖ్యంగా విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ఉంటేనే వారిలో మానసిక ఉల్లాసం కలుగుతుంది. అయితే పలు ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆటస్థలాలు కరువయ్యాయి. ఇరుకైన భవనాల్లో చదువులు చెబుతూ ఆటలకు స్వస్తి చెబుతున్నాయి. ప్రభుత్వం ఎన్‌సిఆర్‌టి ఆదేశాల మేరకు వ్యాయామ విద్య కు అధిక ప్రాధానమిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ముందుకు వచ్చింది. అయితే పరిగి మండలంలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఎన్‌సిఆర్‌టి ఆదేశాలను పక్కన పెట్టాయి.కనీసం క్రీడా మైదానం లేకపోయినప్పటికీ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తూ క్రీడలను పక్కదారి పట్టిస్తున్నారు. ప్రతి పాఠశాలలో క్రీడలు తప్పనిసరి చేస్తూ ప్రతి విద్యార్థిని క్రీడల్లో భాగస్వామ్యం చేసి విద్యతో పాటు మంచి ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలను తీసుకు వచ్చింది. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఆర్‌జికెఎ వంటి కార్యక్రమాల ద్వారా క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే ఇలాంటి కార్యక్రమాలు తమకు ఎందుకు ఏదో కొంత స్థలం లీజుకు తీసుకున్నామా భవనాలు నిర్మించామా విద్యాబోధన మాత్రమే బోధిస్తున్నామా చాలు అంటున్నాయి నేటి ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు. ఎన్‌సిఇఆర్‌టి నిబంధన మేరకు కళాశాలకు ఐదు నుండి పది ఎకరాల క్రీడా స్థలం ఉండాలి. అవి ఏం లేకపోయినప్పటికీ అక్రమ మార్గంలో డిగ్రీ ఇంటర్మీడియట్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నారు ఉన్నతాధికారులు. మరి కొన్ని కళాశాలల్లో స్థలం ఒకచోట కళాశాల ఒకచోట ఉన్నప్పటికీ ఎన్సీఈఆర్టీ నిబంధనలు గాలికి వదిలి అనుమతులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో ఎస్ లైట్ డిగ్రీ కళాశాల, ఐకాన్ ఇంటర్ జూనియర్ కళాశాల, విద్యా నిధి జూనియర్ కళాశాల ఉన్నాయి. అయితే వీటిలో ఏ విద్యాసంస్థకు క్రీడాస్థలం లేదు. ఈ కళాశాలలో కనీసం వ్యాయామ ఉపాధ్యాయుని కూడా నియమించుకోకపోవడం విడ్డూరం, వ్యాయామ ఉపాధ్యాయుడు అవసరంలేదని కళాశాల ప్రిన్సిపల్ అక్కడ పనిచేసే వాచ్‌మెన్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడి పాత్ర పోషించాలని చెప్పడం యాజమాన్య పనితీరుకు నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఓ ప్రైవేట్ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఉన్నప్పటికీ ఆయన రికార్డు అసిస్టెంట్ గా బుక్ కీపర్ గా పనులు చేయించుకుంటూ చాలీచాలని వేతనాలను ముట్ట చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎంతోమంది విద్యార్థులు క్రీడారంగంలో తమ సత్తాను చాటుకుని క్రీడాకోటాలో ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థాయిలో ఉన్నారు. అయితే క్రీడలను నిర్లక్ష్యం చేస్తూ విద్యను మాత్రమే బోధిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కళాశాలలకు క్రీడా మైదానాలు కేటాయించే విధంగా ఒత్తిడి తీసుకువచ్చి వ్యాయామ విద్యను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఐకాన్ కళాశాలలో స్థలం లేక రోడ్డు పక్కనే వదిలిన ద్విచక్ర వాహనాలు

శింగనమల 'తమ్ముళ్ల' మధ్య ఆరని చిచ్చు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు వీడటం లేదు. ఎమ్మెల్యే వర్సస్ టుమెన్ కమిటీ అన్నట్టుగా నడుస్తోంది. నియోజకవర్గం మొత్తం రెండు గ్రూపులుగా క్యాడర్ విడిపోయింది. ఒకరంటే ఒకరికి గిట్టని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి విషయంలోనూ పరస్పరం ఘర్షణకు దిగుతున్నారు. నేతల మధ్య విభేదాలు అనేకసార్లు రచ్చకెక్కినా అధిష్టానం వాటికి ఫుల్‌స్టాప్ పెట్టించలేకపోతోంది. ఇప్పుడు వరుసగా ఈ రచ్చలు రోడ్డుకెక్కుతున్నాయి. శుక్రవారం బుక్కరాయసముద్రం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరో గ్రూపు ఎమ్మెల్యేకు మద్దతుగా టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలా ప్రతి విషయంలోనూ ఆ నియోజకవర్గంలో రెండు గ్రూపుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం రెడ్డిపల్లి గ్రామం వద్దకూడా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రోడ్డు ఎక్కి కొట్టుకున్నారు. గార్లదిన్నె మండలంలోని కనుంపల్లి గ్రామంలో ఇదే రకంగా రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడమే కాకుండా పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇలా వరుసగా ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంటున్నాయి. చివరకు పార్టీ కమిటీల ఏర్పాటులోనూ ఈ వివాదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నేతల మధ్య సఖ్యత కుదరక కమిటీల ఏర్పాటు కూడా సక్రమంగా జరగలేదు. జిల్లా ఇంఛార్జ్ మంత్రి టిజి.భరత్ ఎదుట కూడా నేతలు ఘర్షణ పడ్డారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. తమ వారికి ప్రాధాన్యత కల్పించడం లేదంటే, తమ వారికి కల్పించడం లేదంటూ రెండు గ్రూపుల మధ్య వివాదం నడుస్తూనే ఉంది. వీటి నడుమ రేషన్ డీలర్ల మార్పు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులు చేయాలని భావించినా అవి జరగలేదు. ఇప్పుడు ఈ మార్పుల కోసం ప్రయత్నించే వారు రోడ్డుకెక్కుతున్నారు. వీటిని సమన్వయం చేయడంలో అధిష్టానం తీసుకుంటున్న చర్యలు ఫలించడం లేదు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. వీటిల్లో ఈ గ్రూపుల మధ్య తగాదాలు ఇంకెంతకు చేరుతాయన్నది ఆ పార్టీ శ్రేణుల్లో గుబులు రేపుతోంది. నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉన్నప్పటికీ నేతల మధ్య విభేదాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ పట్టు సడలే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. గత స్థానిక సంస్థల్లో జిల్లాలో అనేక చోట్ల టిడిపి ఓటమి చెందినప్పటికీ శింగనమల నియోజకవర్గంలో కొంత వరకు మంచి ఫలితాలనే పార్టీ సాధించింది. ఈసారి జరిగే ఎన్నికల్లో అధికారం కూడా ఉండటంతో మరింతగా పార్టీ గెలుపునకు అవకాశాలున్నప్పటికీ నేతల మధ్య సఖ్యత లేక నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందన్న చర్చ ఆపార్టీ వర్గాల్లో నడుస్తోంది.

కొనసాగిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి అనంతపురం సిటీ

జిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం కొనసాగింది. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పారదర్శకంగా సాగుతోందని డీఈవో ప్రసాద్ బాబు తెలిపారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో, వికలాంగుల కోటాలో కానీ నకిలీలు ఉన్నట్లు వదంతులు వస్తున్నాయని జిల్లాలో ఇంతవరకు ఇలాంటివి జరగలేదని అన్నారు. ఒకవేళ అలాంటివి వస్తే విచారణకు పంపిస్తామన్నారు. కొంతమంది శారీరక వికలత్వం కలిగిన వారు మెడికల్ బోర్డుకు వెళ్లారన్నారు. వీరిలో ఆరుగురు కర్నూల్‌కు వెళ్లారని వారు అక్కడ నుండి వచ్చిన తర్వాత వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తామని చెప్పారు. శుక్రవారం వరకు నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో భాగంగా ఇంతవరకు 807 మంది సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉండగా 9 మంది మాత్రమే గైర్హాజరయ్యారని చెప్పారు. అందరికీ ఫోన్ ద్వారా కూడా తెలియజేశామని శనివారం వారు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

నీటిలోకి దిగిన యువకుడు మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

వినాయక నిమజ్జనం సందర్భంగా అపశృతి చోటు చేసుకుంది. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించేందుకు మండల పరిధిలోని సంగమేశ్వరుడి వద్ద చిత్రావతి బ్రిడ్జివద్ద నీటిలోకి దిగిన యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం టౌన్ మాధవ నగర్ కు చెందిన బత్తుల శ్రీనివాసులు పెద్ద కొడుకు హేమంత్ కుమార్ తన స్నేహితులతో కలిసి తమ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో బత్తలపల్లి మండల పరిధిలోని సంగమేశ్వర గుడి దగ్గర గల చిత్రావతి బ్రిడ్జ్ వద్దకు వెళ్లాడు. అక్కడ నీటిలోకి దిగిన హేమంత్‌కుమార్ (21) నీటి లోతు చూసి తిరిగి వెనక్కి వచ్చే క్రమంలో ఈదలేక నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలకు గ్రైండర్ వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలుగూరు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు గ్రైండర్ ను వితరణగా అందజేశారు. ఆ గురుకుల పాఠశాలలో చదివి అత్యున్నత స్థానాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల భోజనశాలకు అవసరమైన గ్రైండర్‌ను అందజేశారు. దాదాపు రూ.35 వేల విలువ చేసే గ్రైండర్ ను పాఠశాలకు సమకూర్చారు. మరి కొంతమంది పూర్వ విద్యార్థులు సుమారు 60 లైట్లును సమకూర్చారు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ సాకే రమేష్ గ్రైండర్ సమకూర్చగా, హైవే అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లో ఇంజనీర్ అయిన డి. లక్ష్మీనారాయణ అనే పూర్వ విద్యార్థి 60 టూబ్‌లైట్లను విద్యార్థుల వసతి గృహానికి సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బివి.రమణ బాబు, సూపరింటెంటెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ...

షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్‌కు నోటీసులు

ప్రజాశక్తి - పెనుకొండ

షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్పకు రెవెన్యూ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ స్వాతి మాట్లాడుతూ వాసుదేవపురం రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 25 లో 10.24ఎకరాల ప్రభుత్వ గుట్ట భూమి ఉందన్నారు. ఈ భూమిలో 7.50ఎకరాల భూమిని షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు ఆక్రమించి కంచె వేశారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించామని సర్వేలో భూమి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ అయిందని అన్నారు. ఈ భూమికి సంబంధించిన పత్రాలు తీసుకువచ్చి చూపాలని షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్‌కు తెలిపామన్నారు. 15 రోజులు గడుస్తున్న వారు ఎలాంటి ధ్రువపత్రాలు తీసుకురాలేదన్నారు. భూమి పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో సర్వే నెంబర్ 25-1లో 2.88 ఎకరాల 1993లో కె.జి లక్ష్మమ్మ భర్త వెంకటేశులు పేరు తో డి.పట్టా ఉందని ట్రస్టు సభ్యులు చూపారన్నారు. 2007లో ఈ భూమిని అన్ రిజిస్టర్ ద్వారా ట్రస్ట్ కొనుగోలు చేశామని చెప్పారన్నారు. ఈ పట్టాకు సంబంధించిన పత్రాలు రెవిన్యూ కార్యాలయంలో లేవని, రీసర్వే సైతం నిర్వహించే సమయంలో ప్రభుత్వ భూమి గానే రెవెన్యూ రికార్డులలో ఉందని తహశీల్దార్ వివరించారు. 25 సర్వే నెంబర్ సబ్ డివిజన్ కాలేదన్నారు. అది పూర్తిగా ప్రభుత్వ భూమి కావడంతో భూమిని ఆక్రమించి వేసిన కంచెను తొలగించేందుకు నోటీసులు జారీ చేశామన్నారు. ప్రభుత్వ భూమిని దురాక్రమణ చేయడం చట్టరీత్యా నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

క్రీడాకారుల జీవితాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-హిందూపురం

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారుల జీవితాలు నేటి విద్యార్థులకు, యువతకు స్ఫూర్తి దాయకమని పాంచజన్య పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో జాతీయ క్రీడల దినోత్సవాన్ని ఘనంగా జరుగుకున్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్‌ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణంలో స్పోర్ట్స్ డే అక్షరాల నమూనాలో కుర్చొన్నారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నంద కుమార్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, పరిపాలన అధికారి భాస్కర్, సూపరిండెంట్ విజయేంద్ర, ఏ.హెచ్.ఎం లు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

గాడి తప్పుతున్న ఉపాధ్యాయులు..!

పర్మిషన్ పేరుతో విధులకు డుమ్మా

చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పరిధిలో కొందరు ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో గాడి తప్పుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నారు. అలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.కదిరి పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తమ విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. పర్మిషన్, మధ్యాహ్నభోజన విరామసమయంలో అత్యవసరం అనే పేరుతో విధులకు డుమ్మాకొడుతున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని సందర్భంగా సంబందిత హెచ్‌ఎం పర్మిషన్ కూడా లేకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు సమాచారాం. విద్యార్థులకు చదువు చెప్పకుండా వ్యక్తిగత పనుల కోసం పర్మిషన్, భోజనం విరామం సమయంలో అత్యవసరమని 15 నిమిషాలు పాటు హెచ్‌ఎం నుంచి అనుమతి పొంది మిగిలిన సమయం అంతా విధులకు డుమ్మాకొడుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై హెచ్‌ఎంను సంప్రదించగా శుక్రవారం వ్యక్తిగత పనిలో ఉండి స్కూల్ కి హాజరు అయ్యేందుకు ఆలస్యం కావడంతో మధ్యాహ్నం వరకు సిఎల్ పెట్టినట్లు చెప్పారు. అయితే మధ్యాహ్నం భోజన విరామ అనంతరం అదే హెచ్‌ఎంకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మాకొట్టినట్లు తెలుస్తోంది. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన ఉపాధ్యాయులు ఇలా గాడి తప్పితే విద్యార్థులు నడవడిక ఎలా ఉంటుందని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు బాబ్జాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారి పట్ల జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారులకు సహకారం అందించాలని వక్తలు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి దండు రోడ్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. అయితే ఆర్థిక స్థోమత లేక వారు వెళ్లలేక పోతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధామణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగమణిల ద్వారా తెలుసుకున్న 37వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి నాగేంద్ర శుక్రవారం పాఠశాలకు వెళ్లి ఆర్థికసాయం అందించారు. ఆయా విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన రూ.7 వేలను అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కౌన్సిలర్ ముందుకు రావటం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

అర్హులందరికీ పింఛన్లు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అర్హులైన వారందరికీ సెప్టెంబర్ 1న పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో పింఛన్ల పంపిణీ, పిఎం కిసాన్, యూరియా లభ్యత, తల్లికి వందనం, ఈ కేవైసీ, ఐదు నుండి 20 సంవత్సరాల పిల్లల కోసం తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులకతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 36,793 పింఛన్లుఉండగా ఇందులో వికలాంగుల పింఛన్లు 35, 078, హెల్త్ పింఛన్లు 1715 ఉన్నాయన్నారు. వీటిలో 27, 527 పింఛన్లకు పున: పరిశీలన పూర్తి అయిందన్నారు. ఇందులో 7,163 మందే వివిధ కారణాలవల్ల అర్హత కోల్పోయినట్లు తేలిందన్నారు. అనర్హులైన వారందరికీ ప్రభుత్వం అపీల్ చేసుకునే సౌకర్యం కల్పించిందన్నారు. ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే అపీల్ చేసిన వారందరికీ సెప్టెంబర్ 1, 2వ తేదీలలో యథావిధిగా పింఛన్లు పంపిణీ చేస్తామని ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అయితే అపీల్ చేసుకున్న వారికి నోటీసులు జారీ చేస్తామని వారు సమీప జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులో హాజరై వైద్యులచే 40 శాతం అంతకంటే ఎక్కువ వికలత్వం గుర్తించబడాలన్నారు. అలాంటి వారు వికలాంగుల పింఛను జాబితాలో కొనసాగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయ అధికారి సుబ్బారావు, విద్యుత్ జిల్లా అధికారి సంపత్ కుమార్, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

రైతులకు అందుబాటులో యూరియా : జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. డీలర్లు అక్రమ నిలువలు చేసి ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్లు లేకపోయినా కనీసం కాలువలైనా వేయండి

టిడిపి, వైసిపి కౌన్సిలర్ల వాగ్వాదం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలకసంఘం పరిధిలోని ఆయా వార్డుల్లో రోడ్లు ఎప్పుడైనా వేసుకోండి కనీసం కాలువలైనా వేయండని పలువురు కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం స్థానిక కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 16 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దష్టికి తీసుకువచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందే కౌన్సిల్ హాలులో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఛైర్మన్ రమేష్ కుమార్ సమావేశాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏడవ వార్డు కౌన్సిలర్ నాసిర బాను మాట్లాడుతూ రోడ్లు ఎప్పుడైనా వేసుకోండి వార్డుల్లో కాలువలు వెయాలని కోరారు. కాలువలు సరిగా లేకపోవడంతో వర్షపు నీళ్లన్నీ రోడ్లపైకి వచ్చి అస్తవ్యస్తంగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిటి సమస్యను పరిష్కరించడానికి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి అవసరమైన పైపులు, గేట్ వాల్స్ ఇతర సామాగ్రి తీసుకొచ్చామని చెప్తున్నారనిఅయితే నెలలు గడుస్తున్న నీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. డిసిల్టేషన్ లో జరిగిన అవినీతి పై లోకాయుక్త ఏసిబి డిజికి సమగ్ర విచారణ చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయడంపై వైసిపి కౌన్సిలర్లు ఆ ఉత్తర్వులను చూపిస్తూ అవినీతిని ఎండగట్టారు. దీంతో కొద్దిసేపు సభలో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. చివరకు ఛైర్మన్ రమేష్ కుమార్ తాము విచారణకు సిద్ధంగా ఉన్నామని పేర్కొనడంతో అందరూ శాంతించారు. అంతకు ముందు ఛైర్మన్ మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన కూరగాయల మార్కెట్, వాణిజ్య సముదాయ భవనాలతో పాటు పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణంలో నూతనంగా నిర్మాణం చేసిన కూరగాయల మార్కెట్, వాణిజ్య సముదాయ భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో పురపాలక సంఘానికి తీవ్ర నష్టం జరుగుతోందని పలువురు కౌన్సిలర్లు అన్నారు. దీంతో పాటు మార్కెట్ లోని సెల్లార్ స్థలాన్ని ఎటువంటి అద్దెలు తీసుకోకుండా పూల వ్యాపారస్తులకు కేటాయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీనిపై ఛైర్మన్ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ మార్కెట్ అనుసంధానంగా కూరగాయల టోకు వ్యాపారస్తులకు స్థలాన్ని కేటాయించాల్సి ఉంది. వారికి బస్టాండ్ ఆవరణంలో గతంలో కేటాయించడంతో బస్టాండ్ కుదించకుపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా రైతు బజార్ లో స్థలాన్ని కేటాయించడం జరిగింది. మార్కెట్లో కొన్ని మార్పులు తీసుకువచ్చి కూరగాయల మార్కెట్ అనుసంధానంగా తోపుడు బండ్ల వ్యాపారస్తులకు స్థలాన్ని కేటాయించడంతో పాటు వాణిజ్య సముదాయ

కౌన్సిల్ మీట్‌లో కౌన్సిలర్ల ఆవేదన

భవనంలో సైతం మార్పులు తీసుకువచ్చి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదివరకు నిర్వహించిన బహిరంగ వేలాలను రద్దుచేసి మరోసారి బహిరంగ వేలం నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు ఆసిఫ్ వుల్ల, శివ తో పాటు పలువురు కోరారు. దీనిపై ఛైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ విషయం తో పాటు పట్టడంలో ట్రాఫిక్ సమస్య పైన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించి తగు నిర్ణయాలు తీసుకుందామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ చెత్త చెదారంతో పాటు కాలువలు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. కౌన్సిలర్ ఆసిఫ్ వుల్లా మాట్లాడుతూ రెవిన్యూ సెక్షన్ లో ముడుపులు ఇవ్వనిదే ఏ పని జరగడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గత రెండు కౌన్సిల్ సమావేశాలలో తమ వార్డులో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వార్డుల్లో పర్యటించి కౌన్సిల్ సభ్యులు ఫిర్యాదు చేసిన సమస్యలపై స్పందించి పరిష్కరించాలన్నారు. పలు సమస్యల పైన సమావేశం హాట్ హాట్ గా జరిగినప్పటికీ చివరికి 16 అంశాల్లో 15వ అంశం మినహా అన్ని అంశాలకుకౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ లు జిబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డలకు ఉపాధ్యాయ కొలువులు

ప్రజాశక్తి-తాడిమర్రి

బుడ్డోళ్ల సంధ్య

మండలంలోని చిల్లవారిపల్లి గ్రామానికి చెందిన బుడ్డోళ్ల సంధ్య డీఎస్సీలో 79.636 మార్కులతో ఎస్‌జిటి ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. బుడ్డోళ్ల వెంకట శివ, నారాయణమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో ఒకరే సంధ్య. ఆమె మూడేళ్ల వయసులోనే తండ్రి మృతి చెందగా తల్లి కూలి పనులు చేస్తూనే పిల్లలను చదివించింది. తల్లి కష్టాలు దగ్గరగా చూసిన సంధ్య చిన్నప్పటి నుంచి చదువులో మంచి ప్రతిభ కనబరిచేది. గుత్తి ఎపిఆర్‌ఎస్ స్కూల్లో సీటు సాధించి అక్కడ 6 నుంచి 10వ తరగతి వరకూ చదివింది. 10వ తరగతిలో మార్కుల ఆధారంగా కురుగుంట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్లో సీటు వచ్చింది. తన చిన్నాన్న బి.రాజు(బ్యాంకు ఉద్యోగి) సహకారంతో టిటిసి పూర్తి చేసింది. ఆ తర్వాత టెట్‌లో 132.76 మార్కులు సాధించింది. ఈ క్రమంలోనే అనంతపురంలో ఓ హాస్టల్‌లో ఉంటూ ట్యూషన్స్ చెప్పు డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమై ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది.

పుట్టపర్తి రూరల్ : డీఎస్సీలో మండలంలోని పెడపల్లి గ్రామానికి చెందిన అజీమ్‌బాషా 80.5 మార్కులతో జిల్లాస్థాయిలో 33వ ర్యాంక్ సాధించారు. అల్లబకాష్, రజియాబీ దంపతుల కుమారుడు అజీమ్‌బాషా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఎపి మోడల్ స్కూల్ ప్రారంభం నుంచి అజీమ్‌బాషా విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు క్రీడలు, విలువలు నేర్పించి పలువురు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేశారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం, మిత్రుల సహకారంతో ఈ ర్యాంక్ సాధించినట్లు అజీమ్‌బాషా తెలిపారు.

అజీమ్‌బాషా

'పరిటాల' ఆశయాలను కొనసాగిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రామగిరిలో పరిటాల రవి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్

పరిటాల రవీంద్రకు మరణం లేదని.. ప్రతి అభిమాని గుండె చప్పుడులో ఎప్పటికీ బతికే ఉంటారని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. రామగిరిలో టిడిపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవి కాంస్య విగ్రహాలను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ముందుగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రుల సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఎన్టీఆర్, పరిటాల అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి వెయ్యి యూనిట్లకు పైగా రక్తదానం చేశారు. బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 980 మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ళద్దాలు పంపిణీ చేశారు. అభిమానులు క్రేన్ సాయంతో భారీ గజమాలను ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు వేశారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పరిటాల రవి ఆశయాలు ఎంతో గొప్పవని, ఆయనపై కొందరు అసత్య విమర్శలు చేయడం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. పరిటాల ఆశయాలను పరిటాల శ్రీరామ్, సిద్దార్థ్ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ టిడిపి, పరిటాల అభిమానులు నలుదిక్కులా ముందుండి నడిపిస్తున్నారని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమానికి వేలాది మంది టిడిపి, పరిటాల అభిమానులు తరలివచ్చారు.

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని వైసిపి నాయకులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి విమర్శించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సరైన సమయంలో యూరియా, డిఎపి, తదితర ఎరువులు అందించకపోవడం దారుణం అన్నారు. కొందరు డీలర్లు మాఫియాగా ఏర్పడి ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వైసిపి పాలనలో ఆర్‌బికెల ద్వారా గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, యూరియా అందజేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు సరిపడా ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసిపి హయాంలో కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు చేసిందని, దానికి 60 ఎకరాల భూమి అవసరమని, అయితే ఇంతవరకూ కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పడితే రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు కావాల్సిన ఎరువులు అందించకపోతే వైసిపి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, నాయకులు రవినాయక్, భాస్కర్‌రెడ్డి, కన్యాకుమారి, రుషికేశవరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైద్యులపై దాడి హేయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులపై జరిగిన దాడిని కదిరి ఐఎంఎ బ్రాంచ్ తీవ్రంగా ఖండించింది. ఐఎంఎ సభ్యుడు డాక్టర్ మదన్ కుమార్ మాట్లాడుతూ సేవ చేసే వారిపై దాడి చేసే విష సంస్కృతి మంచిది కాదన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఎస్పీ, డీఎస్పీ స్పందించి వేగంగా నిందితులను అరెస్టు చేయడం పట్ల, ఈ సమస్య పరిష్కారంలో చొరవ చూపిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కదిరి ఐఎంఎ బ్రాంచ్ చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కదిరి ఐఎంఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆజాద్, సెక్రటరీ డాక్టర్ భాస్కర్‌నాయక్, ట్రెజరర్ డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ జానకిరామ్, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ హర్ష, డాక్టర్ సాయి, డాక్టర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-లేపాక్షి

గర్భిణులకు సీమంతంచేస్తున్న కరణం రమామని ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం కరణం రమామని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. వేద పండితుల ఆశీర్వాదంతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రతి గర్భిణికి సంప్రదాయబద్ధంగా పసుపు కుంకుమ, చీర అందజేశారు. ప్రతివారం వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులు సుమారు 200 మందితో పాటు 50 మంది గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఆశా వర్కర్లకు పసుపు కుంకుమ అందజేశారు. ఈ వేడుకలను ఎంపిటిసి లలితమ్మ, హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్ భార్య రాధమ్మ, రమానందన్ కుటుంబ సభ్యులు నిర్వహించారు. లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిరంజీవి, సుబ్రహ్మణ్యం, నాయకులు జయప్ప, ఆనంద్, నరసింహమూర్తి, వైద్య సిబ్బంది, రామానందన్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరిలో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు

వినాయక చవితి వేడుకల్లో భాగంగా పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఏర్పాటుచేసిన వినాయకుని ప్రతిమకు ఆ కాలనీ వాసులు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేషుని ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి శుక్రవారం పట్టణంలో ఊరేగించారు. ఊరేగింపులో వాహనం ముందు ఏర్పాటుచేసిన డిజె పాటలకు కాలనీవాసులు కుటుంబ సభ్యులతో కలిసి చేసటిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కొత్త బైపాస్ రోడ్డులోని ఓ కుంటలో గణనాథుడిని నిమజ్జనం చేశారు.

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథుని విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నీటిలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని ఆదిరెడ్డి పాలెంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని డిజె, యువకుల కోలాహలం మధ్య పురవీధుల గుండా ర్యాలీగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

గాండ్లపెంట : మండలంలోని సోమయాజులపల్లి, కటారుపల్లి, తూపల్లి, మల్లమీదపల్లి, తదితర గ్రామాల్లో వినాయకుని ప్రతిమలను నిమజ్జనం చేశారు. ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో కొలువుదీర్చి ఊరేగింపుగా తీసుకెళ్లి బావులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. భక్తులకు ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వి.రవికుమార్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

తాడిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో గణేశ నిమజ్జన వేడుకలు నిర్వహించారు. నిమజ్జన ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. రామాపురం గ్రామంలో సర్పంచి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఊరేగింపులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆయన పర్యవేక్షించారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. నిమజ్జనం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, పీస్ కమిటీలు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. ఊరేగింపు, నిమజ్జనం సమయంలో అనుసరించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పోలీస్ శాఖ పరంగా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహకరించాలని నిర్వాహకులకు సూచించారు. డిజె, తదితర అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఊరేగింపు సమయంలో రెచ్చగొట్టేలా వ్యవహరించరాదన్నారు. బందోబస్తులో భాగంగా అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తూ ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. విగ్రహాలను క్రమపద్ధతిలో తీసుకెళ్లి నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సహాయం, సమాచారం కోసం స్థానిక పోలీస్ స్టేషన్, లేదా 112 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రైతు సేవా కేంద్రం తనిఖీ

ముదిగుబ్బ : మండలంలోని సానేవారిపల్లె గ్రామ రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం డిఇఒ సుబ్బారావు సందర్శించారు. ఆయన యూరియా పంపిణీ, పంటల సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎడిఎ సనావుల్లా, ఎఇఒ మనోహర్, విహెచ్ఎ పవన్ కళ్యాణ్, గుత్తా కార్తీక్ నాయుడు ఉన్నారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టిన బాషా

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

రొద్దం : మండలంలోని రాగిమేకలపల్లి గ్రామంలో శుక్రవారం యువ నాయకులు బాషా సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించారు. రాచురు నుంచి పెనుకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో రాగిమేకలపల్లి బస్టాప్ వద్ద నుంచి గ్రామంలోకి దాదాపు అర కిలోమీటర్ మేర పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరిగేవి. ఈ విషయాన్ని గ్రామస్తులు మంత్రి ఎస్.సవిత దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ గ్రామ యువ నాయకుడు బాషా సొంత నిధులు సుమారు రూ. 35వేలు ఖర్చు చేసి రోడ్డు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు మంత్రికి, బాషాకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి బాషా, డీలర్ రామంజి, వెంకటరెడ్డి, హనుమంతరెడ్డి, బోయ నాగన్న పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అప్పగింత

కదిరి టౌన్ : ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్(చరవాణి)ను కండక్టర్ కె.హరికుమార్ ప్రయాణికురాలికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. పట్టణానికి చెందిన గుండం శంకరమ్మ శుక్రవారం కదిరి నుంచి మదనపల్లి వెళ్లే బస్సులో వేపురికోట కోటకు వెళ్తూ సెల్‌ఫోన్ మరిచిపోయింది. బస్సు మదనపల్లికి చేరుకున్న సమయంలో రింగ్ టోన్ వినిపించడంతో కండక్టర్ కె.హరికుమార్, డ్రైవర్ టిజెడ్.ఖాన్ గమనించి ప్రయాణికురాలి ఈశ్వరమ్మ కుమారుడు దినేష్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం వారు కదిరికి వచ్చిన తర్వాత ప్రయాణికురాలు ఈశ్వరమ్మకు సెల్‌ఫోన్‌ను అందజేశారు.

క్రీడా చరిత్రలో చిరస్మరణీయులు ధ్యాన్‌చంద్ : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న జెసి అభిషేక్ కుమార్

దేశ క్రీడా చరిత్రలో చిరస్మరణీయులు మేజర్ ధ్యాన్‌చంద్ అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జెసి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ధ్యాన్‌చంద్‌ను ప్రపంచం మొత్తం హాకీ మాంత్రికుడిగా గౌరవిస్తుందన్నారు. తన అద్భుతమైన ఆట తీరుతో హాకీ ఆటకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జన్మించిన ఆయన దేశ సైన్యంలో పని చేస్తూ హాకీలో రాణించి ఎందరికో ప్రేరణగా నిలిచారన్నారు. ధ్యాన్ చంద్ ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం 1956లో అవార్డు అందజేసిందన్నారు. ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయభాస్కర్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ మొరార్జి యాదవ్, హెచ్‌ఎంలు, పిఇటిలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన ధర్మవరం మండలంలోని చిగిచెర్ల, లేపాక్షి మండలంలోని పులమతి, బుక్కపట్నం జడ్పీ స్కూల్ క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మాట్లాడుతున్న ఉద్యం రిజిస్ట్రేషన్ అధికారి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు సూచించారు. పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం ఈశ్వరమ్మ మండల సమాఖ్య మహిళా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే వారు ఉద్యమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మహిళలు ఇప్పటికే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సంఘాల్లో ఉమ్మడిగా కానీ వ్యక్తిగతంగా కానీ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం విస్తరణ అధికారి సంజీవరాజు మాట్లాడుతూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి తగిన గుర్తింపు ఇస్తూ పథకాలు అందిస్తామన్నారు. ఏఏ రంగాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చో వివరించారు. అనంతరం 40 మంది మహిళలు ఉద్యమ్ పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో మండల ఎపిఎం లక్ష్మీనారాయణ, పరిశ్రమల శాఖ అధికారి ఓబులేసు, దుర్గేష్, మండల సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై రాజీ లేని పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటాలు చేస్తామని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, సిఐ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్. వెంకటేష్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల పల్లి పెద్దన్న తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం జెవి.రమణ అధ్యక్షతన ధర్మవరం అంగన్వాడీ ప్రాజెక్టు సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, కార్య దర్శిగా ఎస్.దీన, కోశాధికారిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా బీబీ ఫాతిమా, సహాయ కార్యదర్శులుగా గంగరత్న, రాధాలను ఎన్నుకున్నారు. అతిథులు మాట్లాడుతూ సమ్మె కాలపు హామీల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్‌హెచ్. బాషా, ఎల్.ఆదినారాయణ, ఎస్.హైదర్‌వలి, సరస్వతి, చంద్రకళ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-పెనుకొండ

మాట్లాడుతున్న జడ్జి రాకేష్

బహుజన చైతన్య వేదిక, న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మంగాపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రాకేష్, డీఎస్పీ నర్సింగప్ప, తహశీల్దార్ స్వాతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జడ్జి గిరిజన చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలు, పోక్సో చట్టాల గురించి వివరించారు. ప్రతి సమస్యకు పోలీస్ స్టేషన్, కోర్టులే పరిష్కారం కాదు మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. తహశీల్దార్ బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 గురించి వివరించారు. కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, నాయకులు చంద్రకాంతమ్మ, బాబుప్రసాద్, శ్రీనివాసులు, ప్రత్యూష, నారాయణ, వెంకటనాయక్, తిరుపతయ్య, లక్ష్మణ్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పులమతి పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

ప్రజాశక్తి-లేపాక్షి

జెసి నుంచి స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం, విద్యార్థినులు

2024-25 విద్యా సంవత్సరంలో క్రీడల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ ఆధారంగా మండలంలోని పులమతి జడ్పీ హైస్కూల్ జిల్లా స్థాయి(ద్వితీయ స్థానం) స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైంది. దీంతో శుక్రవారం హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నుంచి హెచ్‌ఎం సుబ్బారావు ఆ అవార్డు అందుకున్నారు. పులమతి పాఠశాల వరుసగా నాల్గోసారి ఈ అవార్డు దక్కించుకోవడం పట్ల హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయ బృందం, పూర్వ వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు, ప్రస్తుత వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పరిటాల రవి విగ్రహావిష్కరణ

పెనుకొండ : పట్టణంలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలి రావాలని ఆ పార్టీ నాయకులు కోరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పరిటాల రవీంద్ర 67వ జయంతి సందర్భంగా పట్టణంలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవు తారన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు ఈశ్వరప్రసాద్, శ్రీరాములు యాదవ్, రాష్ట్ర యాదవ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, అశ్వర్థ నారాయణ, చంద్రకాంతమ్మ, సిద్దయ్య, దేవేంద్ర నాయుడు, సోమశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

ఆదివారం వారపు సంత వాయిదా

పెనుకొండ : మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం పట్టణంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఉంటుందన్నారు. కావున సంత నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుందని, సోమవారానికి వాయిదా వేశామని ప్రజలు గమనించాలన్నారు.

వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రామాంజి

రొద్దం : వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన రామంజిని నియమించారు. రామంజి మాట్లాడు తూ నాపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రభాకర్, ఉపాధ్యక్షులు ఎన్.మహేష్ కుమార్, జనరల్ సెక్రటరీ జక్కుల శ్రీనివాసరావు, వాల్మీకి బోయ సంఘం యూత్ వింగ్ అధ్యక్షులు శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు యుటిఎఫ్ జిల్లా సమావేశం

పరిగి : సేవా మందిరంలో ఈ నెల 31వ తేదీ యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మధ్యంతర కౌన్సిలింగ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతి, అధ్యక్షులు సత్యవతి, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఆసిఫ్‌ఖాన్, హనుమంతప్ప కోరారు. సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, పిఆర్‌సి, ఐఆర్, విద్యావ్యవస్థలో లోపాలపై చర్చిస్తారన్నారు. కావున జిల్లాలోని యుటిఎఫ్ సభ్యులు, మేధావులు, విద్యావేత్తలు హాజరుకావాలని కోరారు.

బాస్కెట్‌బాల్ జట్టుకి జెసి అభినందనలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించు కొని రాష్ట్ర క్రీడా ప్రాధికారక సంస్థ(ఎస్‌ఎపి) ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో అమరావతి ఛాంపియన్‌షిప్-2025 జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. అందులో జిల్లా బాలికల బాస్కెట్ బాల్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. జట్టు సభ్యులను కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్ భాస్కర్ అభినందించి సత్కరించినట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బాలికల బాస్కెట్ బాల్ జట్టును అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్, తదితరులు అభినందించారు.

బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులను అభినందిస్తున్న జెసి

తెలుగు భాషను మరువద్దు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత ఆధునిక యుగంలో ఇంగ్లీష్ అవసరం ఎంతో ఉందని అయితే అదే సమయంలో అమ్మవంటి తెలుగు బాషను మారవరాదని కవి, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డితో పాటు పలువురు కవులు, ఆయా పాఠశాల, కళాశాల తెలుగు అధ్యాపకులు పేర్కొన్నారు. తెలుగు బాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలలు, కళాశాలలతో పాటు కవులు, రచయితలు గిడుగు రామ్మూర్తికి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వేణు విద్యా విద్యా విహార్ పాఠశాలలో వేణు గోపాల్ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సప్తగిరి కళాశాలలో తెలుగు అధ్యాపకులను సన్మానించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్, ఎస్‌డిజిఎస్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రసాద్ అధ్యక్షతన, బాలయేసు కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగంలో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్. జియావుల్లా ఖాన్ అధ్యక్షతన కార్యక్రమాలు జరిగినాయి. పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పెన్నోబులం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి సడ్లపల్లి చిదంబ రెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాజశేఖర్ రెడ్డి, తెలుగు భాష అధ్యాపకులు ఏటిగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. క్రీడాదినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్‌ను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్, రామాంజనేయులు, కిష్టప్ప, మంజుల, హేమలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతు తెలుగుబాష ప్రాముఖ్యతను వివరించారు.. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరెస్పాండెంట్ డి.ఎస్ నందకుమార్, హెచ్‌ఎం గాయత్రి, పరిపాలన అధికారి భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎం లు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, తెలుగు భాష ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక ఎన్ ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ, వ్యాయామ శాఖ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. యం.ప్రగతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకురావాలన్న తలంపుతో ఉద్యమాలను చేసి, తెలుగు సాహిత్య వైతాళికుడుగా పేరుందిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతుల జయంతినే ప్రతి సంవత్సరం ఆగస్టు 29 న తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. అనంతరం విద్యార్థి యువతచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకురాలు డాక్టర్ హేమ మారుతి, శ్రీధర్, భోజప్ప, ప్రకాష్ రావ్, ఎల్ ఆర్ రమేష్, రవి నాయక్, వ్యాయామ అధ్యాపకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పురంలో ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కవి, రచాయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి

మాతృభాష దినోత్సవంలో ప్రముఖులు

లేపాక్షి : స్థానిక ఎంజెపి గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రధానాచార్యులు సుందర్‌రాజు అధ్యక్షతన మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కవితలు, వ్యాసాలు, పాటలు, ప్రసంగాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు జయసింహనాయుడు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ చందన, ఉపాధ్యాయురాలు శకుంతలమ్మ, లక్ష్మీనారాయణ, రంజిత్, అధ్యాపకులు రాజేష్, పిఇటిలు లక్ష్మణ్‌మూర్తి, వేణు, పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఏవో కేశవయ్య మాట్లాడుతూ ప్రముఖ వ్యవహారిక ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మాతృమూర్తిని ఎలా గౌరవిస్తామో అలాగే తెలుగు భాషను గౌరవించాలని సూచించారు. గ్రాంధిక భాషలో ఉన్న వ్యాసాలను వ్యవహారిక భాషలోకి అనువదించి, తెలుగు భాషకు గట్టి పునాది వేసిన మహనీయులు గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. తెలుగు భాష ఔన్నత్యం, గొప్పతనాన్ని తెలిపారు. సమావేశంలో తెలుగు భాష అధ్యాపకుడు మంజునాథ్, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కె.సుదర్శన్ ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా స్పోర్ట్స్, గేమ్స్ ప్రాధాన్యత, ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు హఫీజ్, అధ్యాపకులు బి.బషీర్, ఎస్ఎన్.మూర్తి, రామారావు, రాజగోపాల్, సుధారాణి, స్రవంతి, ఎన్ఎస్ఎస్ పిఒలు డి.శివన్న, కె.రవికుమార్, ఎం.శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ మాట్లాడుతూ తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషతో పాటు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు తీసుకెళ్లి, విశ్వ వేదికలపై మువ్వన్నెల జెండాను ఎగుర వేసి కీర్తి పతాకాలను తీసుకొచ్చేవే క్రీడలు అని, క్రీడాకారులను ప్రోత్సహిద్దామని కోరారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన తెలుగు గేయాలు, పద్యాలు, నృత్యాలు, క్రీడా పోటీలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

శ్రీషిర్డీ సాయి స్కూల్‌లో..

కదిరి పట్టణంలోని శ్రీషిర్డీసాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అకడమిక్ డైరెక్టర్ పసుపులేటి సూర్యతేజ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. తెలుగు భాష ప్రాధాన్యత, గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు పాడిన పాటలు, చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.